సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 10 । జూన్ । 2024



భయపెడుతున్న ప్లాస్టిక్ భూతం
ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధం అమలుకు నోచుకోవడం లేదు. యథేచ్ఛగా దుకాణాల్లో వీటి వినియోగం నానాటికీ పెరుగుతోంది. 2లో



అన్నప్రాశన రోజే..
మనుమడికి అన్నప్రాశన చేసుకొని ఆనందంగా వెళ్తున్న వారి ఆటోను డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. 2లో



పచ్చిరొట్టగా జీలుగ సాగు
నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువుల సాయంతో భూమిని సారవంతం చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 2లో

కళాపరిషత్‌లతో రంగస్థలానికి ఊపిరి

- రాష్ట్రవ్యాప్తంగా 80 కళాపరిషత్‌లు
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 10 పరిషత్‌ల సేవలు
- ఒక్కో పరిషత్ నిర్వహణకు రూ.10 లక్షల వరకు ఖర్చు
- దాతల సహకారంతోనే పరిషత్‌ల ముందడుగు



గుంటూరు అమృతలహరి థియేటర్స్ ఆర్ట్స్ ప్రదర్శించిన నాన్నా నేనొచ్చేస్తా నాటికలో ఓ సన్నివేశం (ఫైల్)

భీమవరం: ప్రజాచైతన్యానికి ఒకప్పుడు ఎంతగానో ఉపయోగపడిన నాటకాలకు సినిమా, టీవీలు రాకతో ఆదరణ తగ్గింది. ఇటువంటి సమయంలో కొనఊపిరితో ఉన్న రంగస్థలానికి కళాపరిషత్‌లు ఊపిరిపోస్తున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో కళాపరిషత్‌లు నాటిక పోటీలు నిర్వహించడం ద్వారా రంగస్థల కళాకారుల ఉనికిని కాపాడుతున్నారు. రంగస్థలంపై ఉన్న అభిమానంతో దాతలు సహకరించడం వల్ల నాటిక పోటీలు నిర్వహించి ప్రదర్శన నాటికలకు పారితోషికాలు ఇవ్వడమేగాక కళాకారులను సన్మానించడం ద్వారా నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావడానికి పలువురు కళాభిమానులు కృషి చేస్తున్నారు.

స్వాతంత్య్ర ఉద్యమ కాలం నుంచి..
స్వాతంత్య్ర ఉద్యమ కాలం నాటి నుంచి నాటక రంగానికి ప్రత్యేక స్థానం ఉంది. గతంలో ఉత్సవాలు, పండగలకు పౌరాణిక, సాంఘిక నాటకాల ప్రదర్శనకు ఒక ప్రత్యేకత ఉండేది. రంగురంగుల సినిమాలు, టీవీలు విస్తృతం కావడంతో కళారంగానికి ఆదరణ తగ్గుతూ వచ్చింది. గంటల తరబడి నాటకాలు చూడడానికి ప్రేక్షకులు ఆసక్తి చూపించక పోవడంతో పలువురు కళాకారులు ఇతర వృత్తులను ఎన్నుకుని జీవనోపాధి పొందుతున్నారు.

1929లో తొలి కళాపరిషత్
రంగస్థల నాటకాలకు కళాపరిషత్‌లు ఊపిరి పోస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 వరకు కళాపరిషత్‌లు ఉండగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, ఏలూరు, తోలేరు, రాయకుదురు, కొంతేరు తదితర ప్రాంతాల్లో 10 వరకు కళాపరిషత్‌లు జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తూ కళాకారులకు అండగా ఉంటున్నాయి. 1929లో తెనాలి ఆంధ్ర కళాపరిషత్ రాష్ట్రంలో మొట్టమొదటి కళాపరిషత్‌గా ఏర్పడగా అప్పటి నుంచి అనేక సంస్థలు నాటిక పోటీలు నిర్వహిస్తున్నాయి.



నాటక రంగ దర్శకుడు, నటుడు తాతాబత్తుల వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం (ఫైల్)

పారితోషికం.. ప్రైజ్‌మనీ
ఒక్కో పరిషత్ ఆధ్వర్యంలో మూడు నుంచి నాలుగు రోజులపాటు పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కళాకారులు పాల్గొంటున్నారు. ఒక్కో నాటిక ప్రదర్శనకు సుమారు రూ.20 వేల వరకు పారితోషికంగా ఇస్తుండగా పోటీల్లో విజయం సాధించిన నాటకానికి ప్రైజ్ మనీ కూడా అందిస్తున్నారు. అలాగే ఉత్తమ కళాకారులకు ప్రత్యేక బహుమతులతో సన్మానం చేస్తూ వారిని మరింత ఉత్సాహపరుస్తున్నారు. అలాగే కళాకారులకు ఉచిత భోజనం, వసతి వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఒక్కో పరిషత్ నిర్వహణకు దాదాపు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుంది. వ్యయ ప్రయాసలతో నిర్వహిస్తున్న పరిషత్‌ల నాటిక పోటీలకు దాతల సహకారం ప్రత్యేకంగా నిలుస్తోంది.

ప్రభుత్వ సహకారం అవసరం



కళాపరిషత్‌ల నిర్వహణకు ప్రభుత్వ సహకారం అవసరం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 వరకు పరిషత్‌లు దాతల సహకారంతో నాటిక పోటీలు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ తోడ్పాటుతో పాటు పరిషత్‌ల నిర్వహణకు కొంత సహాయం అందిస్తే కళారంగానికి అండగా ఉంటుంది.

– జవ్వాది దాశరథి శ్రీనివాస్‌రావు, ఏపీ సాంస్కృతిక, నాటక పరిషత్‌ల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి, భీమవరం

ఇండోర్ స్టేడియాలు నిర్మించాలి



గ్రామాల్లోనే కాదు పట్టణాల్లో సైతం పరిషత్‌ల ఆధ్వర్యంలో నాటిక పోటీల నిర్వహణకు ఇండోర్ స్టేడియాలు లేకపోవడం తీవ్ర ఇబ్బందిగా ఉంది. దీంతో నాటిక పోటీలు వేసవిలోనే నిర్వహించాల్సి వస్తుంది. ప్రేక్షకుల ఆదరణ పెరిగితే మరింత ఉత్సాహంగా కళాపరిషత్‌లు పనిచేస్తాయి.

– మానాపురం సత్యనారాయణ, పాలకొల్లు కళాపరిషత్

నాటక రంగానికి ఊపిరిపోస్తూ..



నాటక రంగానికి ఊపిరి పోయడానికి కళాపరిషత్‌లు చేస్తున్న కృషి అభినందనీయం. కళాపరిషత్‌ల నిర్వహణ వ్యయ, ప్రయాసలతో కూడుకున్నది. కేవలం దాతల సహకారంతో నిర్వహిస్తున్న పరిషత్ నిర్వాహకులకు ప్రభుత్వ నాటక అకాడమీ కూడా సహకరిస్తే మరింత మంది కళాకారులు తయారవుతారు.

– మల్లుల సీతారామ్‌ప్రసాద్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి, భీమవరం

న్యూస్‌రీల్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ



నెక్కంటి నిశాంత్

పెనుగొండ : జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో పెనుగొండ భాష్యం విద్యార్థి నెక్కంటి నిశాంత్ ప్రతిభ కనబర్చి ఆలిండియా 126 ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. ఉత్తమ ర్యాంకు సాధించిన నిశాంత్‌ను భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, సీఈఓ భాష్యం హనుమంతురావు, వెస్ట్ జోన్ ఇన్‌చార్జి ఎ.శ్రీమన్నారాయణ రెడ్డి, ఛాంప్స్ ఇన్‌చార్జి రాణి రోజాజీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐటీఐ ప్రవేశాల దరఖాస్తులకు నేటి వరకు గడువు

ఉండి : జిల్లాలోని 2 ప్రభుత్వ, 16 ప్రైవేట్ ఐటీఐల్లో 2024–25 విద్యా సంవత్సరంలో వివిధ ట్రేడుల్లో సీట్లు పొందేందుకు సోమవారం సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవడంతో పాటుగా ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం (భీమవరం), ఆచంట ప్రభుత్వ ఐటీఐలలో సర్టిఫికెట్ పరిశీలన పూర్తి చేయించుకుని రసీదు పొందాలని సూచించారు. రసీదు పొందిన వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు ఉండి ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో, ఫోన్ 08816-297093, 9676099988 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కార్పొరేషన్‌ల చైర్మన్ పదవులకు రాజీనామా



ముంగర సంజీవ్‌కుమార్



పెండ్ర వీరన్న

ఏలూరు రూరల్: రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ పదవికి ముంగర సంజీవ్‌కుమార్ రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని వాట్సాప్ ద్వారా కార్పొరేషన్ అధికారులకు పంపారు. ఆదివారం ఆయన ఏలూరులో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పరాజయం పొందడంతో తన పదవికి రాజీనామా చేశానన్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలో వడ్డీ కులస్తుల సంక్షేమానికి సీఎం జగన్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. కొల్లేరు సరస్సులో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న వడ్డీలకు పింఛన్ అందించారని గుర్తు చేశారు. అలాగే వందల కోట్ల రూపాయలు వెచ్చించి కొల్లేరు గ్రామాల అభివృద్ధి, అలాగే కొల్లేరు సరస్సుకు రెగ్యులేటర్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారన్నారు. రానున్న రోజుల్లో కాంటూరు కుదింపు చేపట్టి కొల్లేరులో మిగులు భూములు పేదలకు పంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా కొల్లేరు గ్రామాల ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటారన్నారు. జగన్‌కు పూర్తి మద్దతు తెలుపుతారన్నారు.

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పదవికి..
నరసాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ ఎంబీసీ (ఆంధ్రప్రదేశ్ అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి, సంక్షేమ) కార్పొరేషన్ చైర్మన్ పదవికి పెండ్ర వీరన్న రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. రాజీనామా పత్రాన్ని మెయిల్ ద్వారా ప్రభుత్వానికి పంపించానన్నారు. తనపై నమ్మకం ఉంచి సంచార జాతుల వారిని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలో ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి తనకు చైర్మన్ పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వీకరిస్తానన్నారు. ఎన్ని బాధలు, ఇబ్బందులు కలిగినా వైఎస్ జగన్ వెంటే ఉంటూ పార్టీ కోసం పోరాడతానని స్పష్టం చేశారు. సంచార జాతుల వారికి అండగా ఉండి వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు. కార్యకర్తలు అధైర్యపడకుండా పార్టీ కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న స్థానికులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని చల్లవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇళ్ల నిర్మాణం కోసం నిల్వ చేసిన ఇసుకను అక్రమార్కులు తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపు గ్రామాల ప్రజలకు ఇక్కడ పునరావాస కాలనీలను నిర్మిస్తున్నారు. ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఇక్కడ నిల్వ ఉంచిన ఇసుక గుట్టుచప్పుడు కాకుండా అక్రమ మార్గంలో తరలిపోతుందని స్థానికులు అంటున్నారు. ఓ ట్రాక్టర్‌లో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకుని అధికారులకు సమాచారం అందించారు.

శ్రీవారి సేవలో అవనిగడ్డ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

నిట్‌కు డైరెక్టర్ కావలెను

- ఫ్యాకల్టీలూ అవసరం
- తగ్గిన సీట్లతో విద్యార్థులకు నష్టం
- నేడు జోసా కౌన్సెలింగ్ ప్రారంభం



తాడేపల్లిగూడెం: దేశంలో 31వ నిట్‌గా తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) ఆవిర్భవించింది. అద్దె భవనంలో ప్రస్థానం ప్రారంభించినా.. బాలారిష్టాలను వేగంగా అధిగమించింది. అంతే కాకుండా పర్యావరణ హిత భవనాల నిర్మాణం, సదుపాయాల కల్పనతో అంచెలంచెలుగా 720 సీట్లు తెచ్చుకున్న నిట్‌గా ఖ్యాతి గడించింది. ఉద్యోగాల కల్పనలో దేశంలో తిరుచ్చి నిట్‌తో పోటీపడింది. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌కు దరఖాస్తు చేసుకుంది. వందల కంపెనీలు ఏపీ నిట్‌లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు నిర్వహించడానికి క్యూ కట్టాయి. ఏడాదికి రూ.40 లక్షలు దాటి ప్యాకేజీలు పొందుతూ ఏపీ నిట్ విద్యార్థులు సత్తా చాటారు. వరంగల్ నిట్ మెంటార్ ఇనిస్టిట్యూట్‌గా ఉన్న స్థాయిని దాటి ఇన్‌చార్జి డైరెక్టర్‌ల నుంచి శాశ్వత డైరెక్టర్ నిర్వహణలో సువిశాల 172.60 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధిని పరుగులు పెట్టించి దేశాన్ని ఆకర్షించింది. కేంద్ర ఉన్నత విద్యాశాఖ దృష్టిలో ఉన్నతమైన నిట్‌గా ఖ్యాతి గడించింది. డైరెక్టర్ హోదాలో ఉన్న వ్యక్తి గతంలో చేసిన పనులు సీబీఐ విచారణ వరకు వెళ్లడం, సదరు డైరెక్టర్ తొలగింపు వంటివి చకచకా జరిగిపోయాయి. గత రెండేళ్లుగా ఫ్యాకల్టీ, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, పూర్తికాల డైరెక్టర్ లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది.

కేంద్ర కేబినెట్ ఆమోదంతోనే..
దేశంలోని నిట్‌లలో 2024–25కు సంబంధించి సోమవారం నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. తాడేపల్లిగూడెంలోని నిట్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కేంద్రం ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో పూర్తి కాల శాశ్వత డైరెక్టర్, ఫ్యాకల్టీ సభ్యులు కావాల్సి ఉంది. బీటెక్ ప్రోగ్రామ్‌లో బయోటెక్నాలజీ, కెమికల్, సివిల్ ఇంజనీరింగ్, సీఎస్‌ఈ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఈసీఈ, మెకానికల్, మెటలర్జీ ఇంజనీరింగ్ (ఎంఎంఈ) కోర్సులు ఇక్కడ ఉన్నాయి. తగినంతగా ఫ్యాకల్టీలు లేరు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఫ్యాకల్టీల కొరతపై కేంద్ర ఉన్నత విద్యాశాఖకు ఇక్కడి అధికారులు నివేదించారు. అనుమతి కూడా వచ్చింది. కేంద్ర కొత్త కేబినెట్ నియామక ప్రక్రియకు పచ్చజెండా ఊపాల్సి ఉంది. 130 మంది ఫ్యాకల్టీలు, 145 మంది నాన్ టీచింగ్ స్టాఫ్, టీచింగ్ స్టాఫ్ కావాల్సి ఉంది. సరిపడా శాశ్వత ఫ్యాకల్టీలు లేని కారణంగా గత విద్యాసంవత్సరంలో ఏపీ నిట్‌లో ఉన్న సీట్ల సంఖ్యను 720 నుంచి 480కు తగ్గించారు. దీని వల్ల ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు హోం స్టేట్ కోటా కింద వచ్చే 120 సీట్లు కోల్పోవాల్సి వచ్చింది. పూర్తిస్థాయి ఫ్యాకల్టీలు వస్తేనే ఈ సీట్లను కేంద్రం ఆమోదంతో తిరిగి తెచ్చుకొనే అవకాశం ఉంది.

శాశ్వత డైరెక్టర్‌ను నియమించినా రావడం లేదు

దక్షిణాదిన ఏపీ నిట్ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న తరుణంలో డైరెక్టర్‌గా సీఎస్‌పీ రావు పనిచేస్తున్న సమయంలో జరిగిన అవకతవకల కారణంగా సంస్థ ఇమేజ్ తగ్గింది. సీబీఐ కేసులు వంటి వాటిని భూతద్దంలో చూపించి ఏపీ నిట్‌కు ఎవరూ రాకుండా కొన్ని శక్తులు అడ్డుపడుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవు. అయినా ఇక్కడ డైరెక్టర్‌గా నియమించిన వారు బాధ్యతలు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. సీఎస్‌పీ రావు సస్పెండైన తర్వాత ఇన్‌చార్జి డైరెక్టర్‌గా పూనె నిట్ డైరెక్టర్ ప్రమోద్ పడోలేను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన నామమాత్రంగా కార్యకలాపాలు నిర్వహించారు. ఆయన తర్వాత ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బూదరాజు శ్రీనివాసమూర్తిని ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమించారు. ఆయన కూడా కొన్ని నెలలు మాత్రమే పనిచేశారు. తర్వాత శాశ్వత డైరెక్టర్‌గా పూనె నిట్‌కు చెందిన దిలీప్ ఆర్ పేష్వేను కేంద్రం నియమించింది. ఆయన ఇంతవరకు బాధ్యతలు స్వీకరించలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఇక్కడ బాధ్యతలు తీసుకోడానికి ఆయన సుముఖంగా లేరని తెలుస్తోంది. కేంద్ర ఉన్నత విద్యాశాఖ ద్వారా శాశ్వత డైరెక్టర్‌ను ఇక్కడ నియమిస్తే విద్యార్థులకు ప్రయోజనం.

నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకానికి ఆదేశాలు


ఏపీ నిట్‌కు 130 మంది శాశ్వత ఫ్యాకల్టీలు అవసరం. దీని కోసం కేంద్రానికి రాశాం. అప్రూవల్ అయ్యింది. కేంద్ర కేబినెట్ ఆమోదం రావాలి. 145 మంది నాన్‌టీచింగ్ స్టాఫ్ నియామకానికి ఆమోదం వచ్చింది. ప్రక్రియ చేపట్టాలి. టీచింగ్ స్టాఫ్ నియామకానికి ఆమోదం రావాలి. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– దినేష్ శంకరరెడ్డి, రిజిస్ట్రార్

వానాకాలం.. వ్యాధులతో సమరం

- సీజనల్ రోగాలపై అప్రమత్తం
- జ్వరాల వ్యాప్తికి అవకాశం
- పరిసరాల పరిశుభ్రత ముఖ్యం
- తాడేపల్లిగూడెం, తణుకు ప్రభుత్వాస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు





భీమవరం (ప్రకాశం చౌక్) : వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. వాతావరణంలో మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అపరిశుభ్రత, ఆహారంలో లోపాల కారణంగా రోగాలు వస్తాయి. ముందు జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి నిల్వ ఉండటంతో వ్యాధి కారకాలైన దోమలు, సూక్ష్మ క్రిములు, బాక్టీరియా వృద్ధి చెందుతాయి. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడ మాత్రమే సాధారణ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. వానాకాలంలో సాధారణ జ్వరం దగ్గర నుంచి ప్రమాదకరమైన డెంగీ వరకు వ్యాధులు సోకే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు.

వైరల్ జ్వరాలు

సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మక్రిముల వల్ల వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. గాలి, నీరు ద్వారా సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి జ్వరం సోకుతుంది. కొందరికి జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు ఉంటాయి. వైరల్ జ్వరం మూడు నుంచి ఏడు రోజుల వరకు ఉంటుంది.

జాగ్రత్తలు
- భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- నిల్వ పదార్థాలు తినరాదు.
- తాజా, వేడి ఆహారం తీసుకోవాలి.


చికున్ గున్యా

దోమ కాటు వల్ల చికున్ గున్యా వస్తుంది. తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు రోగ లక్షణాలు. రోజురోజుకూ జ్వరతీవ్రత పెరుగుతుంది.

జాగ్రత్తలు
- ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.
- కూలర్లు, టైర్లు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- శరీరం మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి.
- రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

మలేరియా

ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాపిస్తుంది. దోమ కాటు వల్ల దాని లోపల ఉన్న మలేరియా క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయి. 14 రోజుల తర్వాత తీవ్ర జ్వరం వస్తుంది. ఈ దోమలు నిల్వ ఉన్న వర్షం నీటిలో వృద్ధి చెందుతాయి.



జాగ్రత్తలు
- దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి.
- ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్ గాని లేదా పురుగు మందు కలపాలి.

డెంగీ

ఈడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాపిస్తుంది. వైరల్ మాదిరిగా అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తల నొప్పి, ఒళ్లు నొప్పులు, ఎముకలు విరిగేటంత నొప్పి ఉంటుంది. ఒక్కోసారి శరీర అంతర భాగాల్లో రక్తస్రావం ఉంటుంది. కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదరం భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు చిన్నపాటి పొక్కులు వస్తాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుంది. కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు వంటి వాటిల్లో చేరిన వర్షం నీటిలో ఈడిస్ దోమలు వృద్ధి చెందుతాయి.

జాగ్రత్తలు
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- దోమ తెరలు వాడటం మేలు.
- వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలి.
- దోమలు కుట్టకుండా శరీరం కప్పేలా దుస్తులు వేసుకోవాలి.
- జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

హెపటైటిస్–ఎ

వర్షాకాలంలో హెపటైటిస్–ఎ (కామెర్లు) వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కలుషితమైన నీరు, ఆహారం ద్వారా ఈ వ్యాధి సూక్ష్మ క్రిములు శరీరంలోకి వ్యాపిస్తాయి. ఇది కాలేయ కణాల్లో సక్రమిస్తుంది. కాలేయ వ్యాధి కారణంగా రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరుగుతుంది. శరీర భాగాలు పసుపు రంగులో కనిపిస్తాయి.

జాగ్రత్తలు
- శుభ్రమైన ఆహారం తీసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి.

టైఫాయిడ్

టైఫాయిడ్ సాల్మొనెల్లా టైఫి బాక్టీరియా వల్ల వస్తుంది. కలుషితమైన నీరు, ఆహారం వల్ల టైఫాయిడ్ వ్యాపిస్తుంది.

జాగ్రత్తలు
- కాచి చల్లారిన నీళ్లు తాగడం ఉత్తమం.
- రోజుకు 3 నుంచి 4 లీటర్లు నీళ్లు తాగాలి.
- పండ్ల రసం, కొబ్బరి నీళ్లు, సూప్ వంటివి తీసుకోవాలి.
- వైద్యుల సూచనల మేరకు వైద్యం తీసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే సమయం కావడంతో జ్వరం కేసులు ఉంటే వెంటనే స్థానిక పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించి సకాలంలో వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. జ్వరాలు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలి. శుభ్రమైన నీళ్లు, ఆహారం తీసుకోవాలి. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలి.

– డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, భీమవరం

స్థానికంగా సకాలంలో వైద్యం

జ్వరాలకు స్థానికంగా, సకాలంలో వైద్యం అందించడానికి జిల్లాలోని 32, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్నిరకాల రక్తపరీక్షలు అంటుబాటులో ఉన్నాయి. వైద్యులు పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నారు. జ్వరాలపై జరుగుతున్న సర్వే ప్రకారం జ్వర కేసులు ఎక్కువ ఉన్న గ్రామాలు లేదా వార్డుల్లో వైద్య క్యాంపులు ఏర్పాటుకు కూడా వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జ్వరం వస్తే వెంటనే పరీక్షలు

జిల్లాలో జరుగుతున్న ఫీవర్ సర్వేలో జ్వరం ఉన్న వారిని గుర్తించి మొదటగా మలేరియా పరీక్ష లేదా డెంగీ పరీక్ష చేస్తున్నారు. డెంగీ కూడా లేకపోతే కోవిడ్ పరీక్ష చేస్తున్నారు. కోవిడ్ కూడా లేకపోతే సాధారణ జ్వరంగా తీసుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్యం అందిస్తున్నారు. తాడేపల్లిగూడెం, తణుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.

క్లుప్తంగా

పేరుపాలెం బీచ్‌లో సందడి



పేరుపాలెం బీచ్‌లో సందర్శకుల సందడి

మొగల్తూరు: తీరంలోని కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. ఆదివారం ఉదయం నుంచి వాతావరణం మబ్బుగా ఉండటంతో పలు ప్రాంతాల నుంచి బీచ్‌కు పర్యాటకులు తరలివచ్చారు. మరో రెండు మూడు రోజుల్లో పాఠశాలలు, కళాశాలలు తెరవనుండడంతో యువత భారీగా వచ్చారు.

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

ముదినేపల్లి రూరల్: రొయ్యల చెరువులో మోటారు మారుస్తుండగా షాక్‌కు గురై కూలీ మరణించిన సంఘటన మండలంలోని ఊటుకూరు శివారు ప్రొద్దుటూరులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన పెద్దిబోయిన లీలా దుర్గాప్రసాద్(31) గ్రామంలోని రొయ్యల చెరువులో పనికి వెళ్లాడు. చెరువుకు సంబంధించిన మోటారును పక్కకు మారుస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం కై కలూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దుర్గాప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

ములపర్రు సొసైటీకి పసుపు రంగు



ములపర్రు సొసైటీకి పసుపు రంగు వేసిన టీడీపీ నాయకులు

పెనుగొండ: ములపర్రు హిందూ ముస్లీం సొసైటీ రంగును కొందరు టీడీపీ నాయకులు మార్చేశారు. పసుపు రంగు వేయించారు. సొసైటీని స్వాధీనం చేసుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించుకున్నారు. ఇప్పటికే సొసైటీ చైర్మన్ యాండ్ర మంగాదేవి రాజీనామా సమర్పించారు. కార్యాలయంలో తాము ప్రింట్ చేయించిన క్యాలెండర్లు తీసివేయడం దారుణమని మంగాదేవి తప్పుపట్టారు.

సెంట్రల్ జోన్ చాంపియన్‌గా పశ్చిమ గోదావరి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల సీనియర్ మెన్ టీ 20 క్రికెట్ చాంపియన్‌గా పశ్చిమ గోదావరి నిలిచింది. మూలపాడు ఏసీఏ క్రికెట్ గ్రౌండ్స్‌లో మే 31న ప్రారంభమైన అంతర్ జిల్లాల సీనియర్ మెన్ టీ 20 క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు వెస్ట్‌గోదావరి–ప్రకాశం, కృష్ణా–గుంటూరు జిల్లాల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. వెస్ట్‌గోదావరి జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దిగిన ప్రకాశం జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లకు 146 పరుగులు చేసింది. అనంతరం వెస్ట్ గోదావరి జట్టు 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 147 పరుగులు చేసి గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుంటూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకొని కృష్ణా జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 20 ఓవర్లలో 8వికెట్లకు 151 పరుగులు చేయగా గుంటూరు జట్టు 17.1 ఓవర్లలో 7 వికెట్లకు 156 పరుగులు చేసి విజేతగా నిలిచింది.

భయపెడుతున్న ప్లాస్టిక్ భూతం

- పల్లెల్లో పెరుగుతున్న ప్లాస్టిక్ వాడకం
- అమలు కాని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం
- క్యారీ బ్యాగ్‌లు తిని మూగజీవాలు మృత్యువాత



ప్లాస్టిక్ వాడకంపై కైకలూరులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం(ఫైల్)



కైకలూరులో క్యారీ బ్యాగ్‌ను తింటున్న పశువు



క్యారీ బ్యాగులు తిన్న పశువుకు చికిత్స

కై కలూరు/దెందులూరు: ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధం అమలుకు నోచుకోవడం లేదు. హోటళ్లు, కిరాణా, ఫ్యాన్సీ దుకాణాలు, బేకరీలు, కూరగాయల షాపుల్లో వీటి వినియోగం నానాటికి పెరుగుతోంది. ప్రధాన పంట కాలువలు, ఖాళీ స్థలాలు, డంపింగ్ యార్డులు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. దీంతో భూ, వాయు, జల కాలుష్యం పెరిగిపోతోంది. ఆహార వ్యర్థాలు క్యారీ బ్యాగులలో ఉంచి బహిరంగ ప్రదేశాల్లో పడవేయడం వల్ల పశువులు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి.

ఐక్యరాజ్య సమితి ఈ ఏడాది చివరి నాటికి ప్లాస్టిక్ కాలుష్య నివారణపై చట్టబద్ధమైన ఒప్పందాన్ని ప్రకటించనుంది. ఇందుకు 175 దేశాలు ఒప్పందం చేసుకున్నాయి. ప్లాస్టిక్ ఉత్పత్తి 2060 నాటికి మూడురెట్లు పెరుగుతుందని అంచనా. ప్రపంచ ప్లాస్టిక్ ఉత్పత్తి సంవత్సరానికి దాదాపు 400 మిలియన్ టన్నులు. దీనిలో 12 శాతం మాత్రమే కాల్చుతున్నారు. 9 శాతం మాత్రమే రీసైకిల్ అవుతోంది. మిగిలినవి పల్లపు ప్రాంతాలు, సముద్రాల్లో కలుస్తున్నాయి. దీని వల్ల అరుదైన సముద్ర జలచరాలు మరణిస్తున్నాయి.

పల్లెల్లో పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం

పట్టణాలను మించి పల్లెల్లో ప్లాస్టిక్ వినియోగం పెరుగుతోంది. కై కలూరు పంచాయతీలో ప్రతి రోజు 100 నుంచి 150 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తోన్నారు. డంపింగ్ యార్డు లేకపోవడంతో చెత్తను గ్రీన్ విలేజ్ సమీప రోడ్డు వద్ద పడేస్తున్నారు. వీటికి నిప్పు పెట్టడంతో ప్రజల శ్వాసకోశ సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. పంట కాలువలలో ప్లాస్టిక్ వ్యర్థాలను విడిచిపెట్టంతో నీరు విడుదల చేసినప్పుడు తాగునీటి చెరువులలో నీరు నింపడం కష్టమవుతోంది.

మూగ జీవాలు మృత్యువాత

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు మూగజీవాల పాలిట మృత్యుపాశాలుగా మారుతున్నాయి. రోడ్లపై సంచరించే పశువులు వీటిని తింటున్నాయి. జీర్ణకోశ వ్యాధులతో మృత్యువాత పడుతున్నాయి.

కమిటీల జాడ ఏదీ..

ఆరోగ్యానికి హానిచేసే పాలిథిన్ సంచుల వినియోగాన్ని నిషేధిస్తూ కేంద్రం 2010లో జీవో విడుదల చేసింది. జిల్లా, మున్సిపాలిటీ, గ్రామ స్థాయి అధికారులు కమిటీలుగా ఏర్పడ్డారు. సవరించిన నిబంధనల మేరకు 100 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించారు. గ్రామ పంచాయతీలు తీర్మానాలు చేసి విధించిన జరిమానాల వివరాలను ప్రతీ ఏటా జూన్ 30న రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు నివేదించాలి. అధికశాతం నిబంధనలు అమలు కావడం లేదు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఇళ్ల వద్ద తడి, పొడి చెత్తను సేకరించి దాన్ని నుంచి ఎరువులు తయారు చేయాలని సంకల్పించారు. వీటిలో వచ్చే ప్లాస్టిక్ వస్తువులను వేరు చేసి పునర్వినియోగం చేయాలి. కాని అమలు సాధ్యం కావడం లేదు. ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటే ఫలితాలు దక్కుతాయి.

అంధకారంగా భవిష్యత్తు



క్యారీ బ్యాగ్ భూమిలో కలవాలంటే 150 నుంచి 200 సంవత్సరాలు పడుతుంది. కాల్చే సిగరెట్ చివరి ఫిల్టర్ మొన భూమిలో విచ్ఛిన్నం కావడానికి 5 ఏళ్లు పడుతుంది. స్వీప్ ద్వారా ప్లాస్టిక్ వినియోగంపై నష్టాలను వివరిస్తున్నాం. కోర్టులో ప్లాస్టిక్ వాడకంపై పీఎల్‌సీ కేసు సైతం నమోదు చేశాం. భవితరాల భవిష్యత్తు బాగుండాలంటే ఇప్పటి నుంచి ప్లాస్టిక్‌ను వాడొద్దు.

– పి.పవన్‌కాంత్, న్యాయవాది, స్వీప్ సంస్థ వ్యవస్థాపకులు, కైకలూరు

అవగాహన కలిగిస్తున్నాం

హానికర క్యారీ బ్యాగులను వినియోగించవద్దని వ్యాపారులు, ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం. మండల స్థాయిలో ఈఓపీఆర్డీకి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాం. పంచాయతీల ద్వారా తనిఖీలు చేయిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా క్యారీ బ్యాగులను విక్రయిస్తే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంటు రూల్స్ ప్రకారం జరిమానాలు విధిస్తాం. ఇప్పటికే ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– వీవీ.ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో, కైకలూరు

నియంత్రణ అవసరం



ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది. పర్యావరణ మేధావులు సూచనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలి. ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండకపోతే మనం భారీ మూల్యం చెల్లించుకోవాలి. భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

సిస్టర్ టీనా మరియా, ప్రిన్సిపల్, సెయింట్ మేరీస్ యూపీ స్కూల్

నైపుణ్యాన్ని వెలికితీస్తున్న చెస్ పోటీలు



విజేతలకు సర్టిఫికెట్ల బహూకరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): చెస్ పోటీలు విద్యార్థుల్లో నైపుణ్యం, ప్రతిభ వెలికితీస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన చైర్మన్ చెరుకువాడ అప్పల రామకృష్ణవర్మ అన్నారు. మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో పట్టణంలో వేసవి శిక్షణను తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం ప్రాంతాలకు చెందిన 90 మంది చెస్ క్రీడాకారులకు అందజేశారు. ఆదివారం గుబ్బం ఫంక్షన్ హాలులో చెస్ పోటీలు జరిగాయి. వర్మ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా మెగా అసోసియేషన్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల ద్వారా ప్రతిభ వెలికి తీసి, చెస్ క్రీడాకారులను గుర్తించి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో పోటీలకు పంపి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గట్టిం నవీన్, మాస్టర్ చెస్ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ సత్తి నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు. కార్యదర్శి ఎస్ఎస్ చంద్రశేఖర్ పర్యవేక్షించారు. తాడేపల్లిగూడెంకు చెందిన జోగేంద్ర, రుత్విక్ రెడ్డి, 1, 3 స్థానాలలో నిలిచారు. తణుకు చెందిన తరుణ్‌సాయి 2వ స్థానం సాధించాడు.

ప్రశాంతంగా లాసెట్



లాసెట్‌కు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: న్యాయకళాశాలల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష లాసెట్ వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగింది. ఈ కేంద్రంలో పరీక్షకు 250 మందికి 205 మంది పరీక్షకు హాజరయ్యారు.

అన్నప్రాశన రోజే తిరిగిరాని లోకాలకు

రోడ్డు ప్రమాదంలో అమ్మమ్మ, ఆరు నెలల చిన్నారి మృతి



గొల్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బొందిలి సునీతాబాయి

నూజివీడు: మనుమడికి అన్నప్రాశన చేసుకొని ఆనందంగా వెళ్తున్న వారి ఆటోను డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. నూజివీడు మండలం గొల్లపల్లి వద్ద ఆదివారం సాయంత్రం ఆటోను డీసీఎం వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో అమ్మమ్మ, మనుమడు మృతి చెందిన హృదయ విదారక సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా మచిలీపట్నం సమీపంలోని చిన్నాపురానికి చెందిన బొందిలి నాగరాజుసింగ్ తన పెద్ద కుమార్తె బొందిలి సంతోషీబాయిని నూజివీడు పట్టణంలోని బొందిలీపేటకు చెందిన బొందిలి బాలాజీ సింగ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరి కొడుకై న బొందిలి హియాన్ సాయి సింగ్‌కు అన్నప్రసాన నిమిత్తం ఆటోలో ఉదయం నూజివీడు వచ్చారు. అన్నప్రాశన ముగించుకుని సాయంత్రం ఆటోలో చిన్నాపురం వెళ్తుండగా 6.10గంటల సమయంలో గొల్లపల్లి వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో ఆరు నెలల బాబుతో పాటు అమ్మమ్మ బొందిలి సునీతాబాయి(48) మృతిచెందింది. ఆటోలో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో పట్టణంలోని బొందిలిపేటలో తీవ్ర విషాదం నెలకొంది. కొద్దిసేపటి క్రితం వరకు తమ కళ్లముందు ఎంతో సంతోషంగా ఉన్న వారు ప్రమాదం బారిన పడటం దారుణమని తల్లడిల్లుతున్నారు. ఈ ప్రమాదంలో ఆటో పక్కకు వెళ్లి పడటంతో అక్కడే నిల్చున్న పామర్తి రమేష్(32)కు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ మోర్ల నాగరాజు ప్రమాదం నుంచి బైటపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే సీఐ రామకృష్ణ హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూశారు. డీసీఎం వ్యాన్ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 15న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్–16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ట్రయల్స్ నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్యవర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని వివరించారు. ఎంపికైన వారు ఏసీఏ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గలవారు పుట్టినతేదీ ఒరిజనల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు.

ముగిసిన చెస్ పోటీలు



భీమవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో గత 6 రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ ఓపెన్ ఫిడే రేటింగ్ చదరంగం పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో మన దేశంతోపాటు కెన్యా, అమెరికా దేశాల నుంచి 273 మంది క్రీడాకారులు పాల్గొన్నారని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. మొదటి స్థానంలో ఆఫ్రిద్ టి.ఖాన్ (ధర్మవరం), రెండో స్థానంలో జ్ఞానసాయి సంతోష్ (కాకినాడ), మూడో స్థానంలో కుషాల్ (అనంతపురం), నాల్గో స్థానంలో భరత్ కుమార్ రెడ్డి (హైదరాబాద్) నిలిచారన్నారు. విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతులను క్లబ్ కార్యదర్శి పి.వి.రామరాజు అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు, తోట హరిబాబు, ఎం.మురళి, టి.నరేష్, టి.సురేష్ పాల్గొన్నారు.

పచ్చిరొట్టగా జీలుగ సాగు



జీలుగ పంట(ఫైల్)

ముసునూరు: నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువుల సాయంతో భూమిని సారవంతం చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పశువుల పేడ కంటే పచ్చిరొట్ట పదిరెట్లు ఎక్కువగా భూమిని సారవంతం చేస్తుందని చెబుతున్నారు. పచ్చిరొట్ట ఎరువు పంటల్లో జీలుగ సాగు చక్కటి ఫలితాలనిస్తుంది. చాలా ప్రాంతాల్లో రైతులు జీలుగ సాగుకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. నేల స్వభావాన్ని బట్టి జీలుగ సాగు చేసుకుంటే పంటలకు అనుకూలంగా ఉంటుంది. వ్యవసాయ శాఖ వేసవిలోనే పచ్చిరొట్ట ఎరువు పంటల విత్తనాలు సబ్సిడీపై అందించి, ప్రోత్సహిస్తుంది.

జీలుగ సాగు వల్ల ప్రయోజనాలు

- పొలంలో జీలుగను కలియదున్నితే నేలకు సారం పెరుగుతుంది.
- నేలలో చౌడును నివారించవచ్చు.
- మొక్కలకు రెండు శాతం నత్రజని, సూపర్ ఫాస్ఫేట్ అదనంగా అందుతుంది.
- జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మ ధాతువులను పంటకు అందిస్తుంది.
- నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మారుస్తుంది.
- నేలలో భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి, నేలలోకి నీరు ఇంకే గుణాన్ని పెంచుతుంది.
- పంట పొలంలో నీటి నిల్వ సామర్థ్యం పెంచుతుంది.
- పంట పొలంలో వానపాముల అధిక ఉత్పత్తికి తోడ్పడుతుంది.
- లెగ్యూం జాతికి చెందిన మొక్క కావడంతో వేర్లలో నత్రజని స్థిరంగా ఉంటుంది.
- పొలంలో తుంగ, గరిక వంటి కలుపు మొక్కల పెరుగుదలను అడ్డుకుంటుంది.
- నేలలో ఉండే ప్రయోజనకర సూక్ష్మజీవుల సంఖ్యను మెరుగుపరుస్తుంది.
- వేసవిలో భారీ గాలులు, వర్షాల వల్ల నేల కోతను నివారిస్తుంది.
- రసాయనిక ఎరువుల వాడకాన్ని 15 నుంచి 25 శాతం వరకు తగ్గిస్తుంది.

జీలుగ సాగుకు అనువైన సమయాలు:


ప్రధాన పంట కోయగానే నేలలో మిగిలిన తేమను సద్వినియోగపర్చుకునేలా జీలుగ విత్తనాలు చల్లుకోవాలి. తేమ చాలని ప్రాంతాల్లో వేసవిలోనే దుక్కి దున్ని, తొలకరి వర్షాలు పడగానే విత్తుకోవాలి.

- నీటి వసతులు గల ప్రాంతాల్లో వేసవిలోనే సాగు చేయడం లాభదాయకం. రెండు పంటల మధ్య కాల వ్యవధిలో కూడా విత్తుకొని కలియ దున్నవచ్చు. ఏప్రిల్, మే నెలల్లో ఖరీఫ్ పంటలు వేసే ముందు, తొలకరి వర్షాలు కురవగానే జీలుగ విత్తనాలు విత్తుకోవాలి.

పొలంలో జీలుగ పంటను కలిపే విధానం

జీలుగ మొక్కలు పూత దశకు చేరుకున్నాక మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించాలి. ఆ తదుపరి రోటవేటర్‌ను ఉపయోగిస్తే జీవ పదార్థం వేగంగా కుళ్ళి పోతుంది.

అన్ని ఆర్బీకేల్లో జీలుగ విత్తనాలు



నత్రజని, భాస్వరం, పొటాష్, మాంగనీస్ వంటి పోషకాలను పంటలకు విరివిగా అందించే జీలుగను పచ్చిరొట్ట ఎరువుగా వాడి లాభాలు పొందాలి. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలో జీలుగ విత్తనాల పంపిణీ కొనసాగుతోంది.

సందిపాము మధుమోహన్, మండల వ్యవసాయాధికారి, ముసునూరు

క్లుప్తంగా

కోలా ట్రస్ట్ సహాయం అభినందనీయం



సహాయం అందిస్తున్న కోలా ట్రస్ట్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేద విద్యార్థులకు తాడేపల్లిగూడెం కోలా రోహిణి గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.1.17 లక్షల సహాయాన్ని అందించారు. సిపాయిపేటలోని ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో పేద విద్యార్థులకు కాలేజీ ఫీజులతో పాటు అనారోగ్యంతో ఉన్నవారికి మందులు నిమిత్తం ఆర్థిక సహకారం అందించారు. ఫౌండేషన్ చైర్మన్ రాజన్ సుభాషిని, సెక్రటరీ రాజన్, ప్రముఖులు తాతా శ్రీనివాస రావు, అంబటి కృష్ణ, వట్టి బుజ్జి, గంగుల వెంకటరత్నం, కలిగొట్ల వెంకట సుబ్బారావు, జానకి రామయ్య పాల్గొన్నారు.

విక్టర్‌బాబు సేవలు స్ఫూర్తిదాయకం

తణుకు టౌన్: ఉద్యోగ సంఘ బాధ్యతలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో బొడ్డు విక్టర్ బాబు సేవలు పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతపల్లి గురుప్రసాద్ తెలిపారు. ఆదివారం తణుకులో ఇటీవల మృతి చెందిన తణుకు టెలికాం జేఈ, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొడ్డు విక్టర్‌బాబు సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపకులు పేరూరి మురళీకుమార్, గౌరవ అధ్యక్షుడు జీ.అంబేద్కర్, ప్రధాన కార్యదర్శి ఎంఎస్.సుకుమార్, ఎన్.జయరాజు, బండి ప్రసాద్, సంజీవరావు, తణుకు టెలికాం ఉద్యోగ సంఘాల నాయకులు విక్టర్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, విక్టర్ బాబు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నీలాద్రిపురంలో విజయోత్సవం



కృష్ణాయపాలెంలో విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: కృష్ణాయపాలెంలో ఆదివారం కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ విజయం సాధించడంపై సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్‌కు గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. గ్రామంలోని ముత్యాలమ్మ వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలాద్రిపురంలో నిర్వహించిన సంబరాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జీ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు స్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు పోతుల అన్నవరం, కృష్ణాయపాలెం సర్పంచ్ బోడేపూడి వెంకటసుబ్బలక్ష్మి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల కిటకిట



ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ముత్యాలమ్మ దర్శనానికి సరిహద్దు జిల్లా అయిన కృష్ణా జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగులు



స్టేషన్‌రోడ్డు వద్ద మహానేత వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

నరసాపురం: ఎన్నికల కోడ్ ముగిసినా నరసాపురం పట్టణంలో జాతీయ నాయల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించే అంశంలో అధికారులు దృష్టి సారించలేదు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధాన కూడళ్లతోపాటుగా అన్ని ప్రాంతాల్లో ఉన్న నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఈ నెల 6తో ఎన్నికల కోడ్ ముగిసింది. కానీ కోడ్ కారణంగా నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించలేదు.

పంటకు నిప్పు.. భవిష్యత్తుకు ముప్పు

- పొలాల్లో పంట వ్యర్థాలకు నిప్పుపెడుతున్న రైతులు
- లాభం కన్నా నష్టమే ఎక్కువంటున్న అధికారులు
- వాతావరణ కాలుష్యంతోపాటు పచ్చదనం కనుమరుగు



ఇటీవల తణుకు మండలంలో నిప్పు పెట్టడంతో కాలుతున్న వరి పంట వ్యర్థాలు

తణుకు: వరి కోతలు పూర్తయ్యాక పంట పొలాలకు నిప్పు పెట్టడం ఆందోళన కలిగిస్తోంది. ఒక పక్క మండే ఎండలకు తోడు పొలాల్లో మంటలు మరింత కాక పుట్టిస్తున్నాయి. ఇవే ఒక్కోసారి ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. వరికోత యంత్రాల పుణ్యమాని వరి కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని రాశులుగా పొలాలు, గట్లపై నిల్వ చేస్తున్నారు. కొంతమంది రైతులు అవగాహన రాహిత్యంతో పొలాల్లో మిగిలిన గడ్డికి నిప్పు పెట్టడం వలన పరిసర రైతులకు శాపంగా మారింది. ఒక పొలంలో పెట్టిన నిప్పు సమీప పొలాలకు వ్యాపిస్తుండడంతో ఆ పొలాలు, చేల గట్టుపై నిల్వ చేసిన ధాన్యం రాశులకు నిప్పు అంటుకుంటుందేమోనని సర్వత్రా ఆందోళన నెలకొంటోంది. ఇలాంటి ఘటనల సమయంలో ఉరుకులు, పరుగులతో ధాన్యపు రాశులను నీటితో తడుపుకోవాల్సిన పరిస్థితి వస్తోంది.

తరచూ ప్రమాదాలు..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు మండిపోతున్నాయి. ప్రస్తుతం 36 నుంచి 42 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విపరీతమైన వడగాడ్పుల నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. పొలాల్లో గడ్డి వాములు కాలిపోయి రైతులకు నష్టం మిగులుతోంది. పశువులకు మేత దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో 46 వేల ఎకరాల్లో వరి పండించి కోతలు పూర్తి చేశారు. ఈ క్రమంలో చేలల్లో మిగిలిన గడ్డికి రైతులు నిప్పు పెడుతున్నారు. భారీగా పొగ ఆవరించి ఆ వేడికి స్థానిక నివాసాల వారు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒకవైపు ఎండల తీవ్రత అధికమవడం, గడ్డికి నిప్పు పెట్టడం వలన గ్రామాల్లో భరించలేని వేడి వస్తోంది.

పచ్చదనం కనుమరుగు..

తణుకు: కొందరి అనాలోచిత చర్యలతో రహదారి పక్కన మొక్కలు దగ్ధమవుతున్నాయి. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో విలువైన మొక్కలు బుగ్గిపాలవుతున్నాయి. ప్రతీ సంవత్సరం మొక్కలు నాటుతున్నప్పటికీ సంరక్షణ లేక కొన్ని చనిపోతున్నాయి. మంటలతో మరికొన్ని కాలిపోవడంతో పచ్చదనం కనుమరుగవుతోంది. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా కుళ్ల బెడితే సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంట పొలాల్లో కోతల అనంతరం వ్యర్థాలకు నిప్పు పెట్టడం వలన బ్యాక్టీరియాతో పాటు పంటకు మేలు చేసే మిత్ర పురుగులూ నాశనం అవుతాయని అధికారులు వివరిస్తున్నారు.

చేతి వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి



తణుకులో అసోసియేషన్ 13వ వార్షికోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రరావు

తణుకు అర్బన్: స్వశక్తితో జీవనోపాధి పొందుతున్న లేత్ అండ్ ఆర్క్ వెల్డింగ్ డిజైన్ వర్క్స్ సభ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం సహకరించాలని ది తణుకు లేత్ అండ్ ఆర్క్ వెల్డింగ్ డిజైన్ వర్క్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మండూరి సురేష్, కుడుపూడి చంద్రరావు అన్నారు. అసోసియేషన్ 13వ వార్షికోత్సవం సందర్భంగా తణుకు కొండాలమ్మ ఆలయ ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నేటి ఆధునిక యుగంలో వస్తున్న నూతన పోకడలను అందిపుచ్చుకుని అసోసియేషన్ సభ్యులంతా తమ వృత్తిలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ బలోపేతానికి సభ్యులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కనిత శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బళ్ల నాని, కోశాధికారి పువ్వాడ త్రిమూర్తులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల హబ్‌గా తణుకు

- న్యూరో, గుండె, ఆర్థోపెడిక్, నెఫ్రాలజీ విభాగాల్లో నాణ్యమైన వైద్యసేవలు
- పట్టణంలో 70కి పైగా ప్రైవేట్ ఆస్పత్రులు



తణుకులో ఐ లవ్ తణుకు కట్టడం

తణుకు అర్బన్: వ్యాపార వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతున్న తణుకు పట్టణంలో ప్రైవేటు ఆస్పత్రులు సైతం అధునాతన వసతులతో నెలకొన్నాయి. వైద్యరంగంలో తాజాగా వచ్చిన నూతన ఆవిష్కరణలకు సంబంధించిన సౌకర్యాలు తణుకులో అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వచ్చే వారికి అత్యవసర విభాగాలు నాణ్యమైన సేవలందిస్తున్నాయి. ప్రశాంతతకు మారుపేరుగా ఉండే తణుకు ప్రాంతంలో ఇటీవల కాలంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతం తమ పరిధి పెంచుకుంటూ అభివృద్ధి చెందుతుంది. దీంతో నగరాల నుంచి సైతం వైద్యులు తణుకు పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో హాస్పటల్స్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో తణుకు ప్రాంతం హాస్పిటల్స్ హబ్‌గా పేరుగాంచింది. వివిధ రుగ్మతలతోపాటు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులు తణుకులోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతుంటారు.

70కి పైగా ఆస్పత్రులు...

హాస్పిటల్స్ హబ్‌గా పేరుగాంచిన తణుకు పట్టణ ప్రాంతంలో సుమారుగా 70కి పైగా ఆస్పత్రులు అందుబాటులో ఉన్నాయి. గతంలో సుదీర్ఘ వ్యాధుల చికిత్సకైనా, అత్యవసర వైద్యసేవల కోసమైనా విజయవాడ, రాజమండ్రి, కాకినాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. కానీ నేడు గుండె, న్యూరో, నెఫ్రాలజీ, యూరాలజీ, అంకాలజీ వంటి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా తణుకు పట్టణ ప్రాంతం జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో ఎక్కువ శాతం ప్రమాదాల కేసులు వస్తుంటాయి. ఈ ప్రమాదాల్లో అధిక శాతం హెడ్ ఇన్‌జ్యూరీలతోపాటు ఆర్థోపెడిక్ విభాగాల్లో నాణ్యమైన వైద్యసేవలు అవసరమవుతుంటాయి. ఈ సేవలన్నీ తణుకులో వివిధ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉండడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పింది.

అందుబాటులో అధునాతన పరికరాలు..

వైద్యసేవలే కాకుండా వైద్యపరీక్షల నిమిత్తం కూడా అధునాత వైద్యపరికరాలు తణుకు ప్రాంతంలోని ల్యాబ్‌లలో అందుబాటులోకి వచ్చాయి. ఎంఆర్‌ఐ తోపాటు పలురకాల స్కానింగ్‌లు తణుకులో అందుబాటులోకి రాగా శరీరంపై ఎటువంటి కోత లేకుండానే శస్త్ర చికిత్సలు చేస్తుండడం విశేషం.

విశ్వబ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తణుకు టౌన్: మండలంలోని వేల్పూరు గ్రామంలో విశ్వబ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహించారు. వేదికలో సుమారు 200 మంది వధూవరులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారని విశ్వబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టేకి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్, సాలెండం రఘురాం, మానేపల్లి నాగేశ్వరరావు, తణుకు సంఘం అధక్షుడు మందారపు నాగ మనోహర్, కార్యదర్శి మేటకోటి నరేంద్ర కుమార్, టేకి సతీష్, కొత్తూరి రామ్మోహనరావు, పుల్లేటికుర్తి బ్రహ్మాజీ, లక్కోజు మోహన్ పార్వతీశం, ముదపాక నాగేశ్వరరావు, కోరిమిల్లి సుబ్బారావు, వెండి శ్రీను, వీర్ల రామచంద్రరావు, వీర్ల మల్లేశ్వరరావు, కృష్ణమాచారి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



మొగల్తూరు ప్రధాన రహదారిపై చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు

మొగల్తూరు: మండలంలోని కడలివారి పాలెం నుంచి పెద్దపల్లవపాలెం వరకు నిర్మించేందుకు చేపట్టిన రహదారి పనులు ప్రారంభమయ్యాయి. నరసాపురం, సీతారాంపురం, మొగల్తూరు మీదుగా జాతీయ రహదారి విస్తరించింది. దీంతో ఈ రహదారి నిర్మాణానికి జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ రూ.10 కోట్లు మంజూరు చేసింది. దీంతో మొగల్తూరు ప్రధాన రహదారి నిర్మించేందుకు గత నెల 10న రోడ్డు తవ్వి, కంకర పోశారు. గత నాలుగు రోజులుగా రహదారి పనులు సాగిస్తున్నారు. స్థానిక కడలివారి పాలెం నుంచి ఆంధ్రా బ్యాంక్ వరకు రహదారి పనులు పూర్తయ్యాయని, మిగిలిన రహదారి కూడా త్వరలో పూర్తి చేస్తామని జాతీయ రహదారుల శాఖ డీఈ కిరణ్ కుమార్ తెలిపారు. రహదారి పనులు పూర్తయిన తరువాత రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖకు రోడ్డును అప్పగిస్తామని ఆయన తెలిపారు.

ప్రజల మన్నన పొందేలా సేవలందించాలి



క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

ఆకివీడు: సేవా రంగంపై ఆసక్తితో పాటు మహిళామూర్తులు లయినిజం బాధ్యతల్ని కూడా స్వీకరించడం గర్వకారణమని లయన్ మల్టీపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ దామెర్ల శ్రీశాంతి అన్నారు. స్థానిక లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం ఆదర్శ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీశాంతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్న తరుణంలో ఆకివీడు ఆదర్శ క్లబ్‌కు అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారిగా ముగ్గురు మహిళలు ప్రమాణ స్వీకారం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆకివీడు ప్రాంతంలో లయన్స్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తి చేసుకుందని, ఒక్క మహిళ కూడా అధ్యక్ష పదవి స్వీకరించలేదన్నారు. ప్రప్రథమంగా ఏర్పడిన మహిళా కమిటీ ఉత్తమ సేవలందించి ప్రజల మన్ననలు, లయన్స్ అంతర్జాతీయ మన్ననలు పొందాలని ఆమె పిలుపునిచ్చారు. కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించిన చిలువూరి కృష్ణంరాజు మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు ఎదుర్కొంటున్న అంధత్వం, డయాబటీస్, క్యాన్సర్‌తో పాటు ఆకలి బాధల్ని తీర్చే విధంగా లయన్స్ సేవలందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లయన్ మాజీ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు, గొంట్లా కృష్ణమూర్తి అతిథులుగా పాల్గొని మాట్లాడారు. నూతన కమిటీ అధ్యక్షులుగా కాకర్ల రాజరాజేశ్వరి, కార్యదర్శిగా మోరా జ్యోతిరెడ్డి, కోశాధికారిగా ఎంవీఎస్ నాగమణి, లియో క్లబ్ అధ్యక్షులుగా సోమిశెట్టి హర్షవర్ధన్, క్యాదర్శిగా గుర్రం సాయి ప్రదీప్, కోశాధికారిగా గుర్రం హేమంత్, కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. అధిక సంఖ్యలో లయన్స్ ప్రతినిధులు, బంధువులు పాల్గొన్నారు.

సంచార వైద్యశాలలో వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్ : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో 5 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా జనరల్ వైద్యులు సుంకవల్లి నీలు మహేంద్ర, సాతులూరి అనుస్మితలు తణుకు పట్టణం, మండపాక, పైడిపర్రు పరిసర గ్రామాల్లోని మంచంపై నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు అందించారు. వీర వెంకట ఇండియా నెట్ వర్క్ ఫౌండేషన్ ద్వారా డాక్టర్ కేవీరావు ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణానందం తదితరులు పాల్గొన్నారు.

సుప్రభాతం వీధి నాటిక ప్రదర్శన



పాలకొల్లు పట్టణంలో సుప్రభాతం వీధి నాటిక ప్రదర్శిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: శ్రీధర్ అండ్ రాధా కల్చరల్ అసోసియేషన్, రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ 65వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సుప్రభాతం సందేశాత్మక వీధి నాటికను ప్రదర్శించారు. ప్రముఖ రచయిత, నటుడు, దర్శకుడు, రక్త కన్నీరు నాగభూషణం అవార్డు గ్రహీత మాడుగుల వెంకట కృష్ణమోహన్ ప్రధాన పాత్రలో నటులు జంగయ్ గౌడ్, మను ప్రియ నాటికలో పలు పాత్రలు పోషించారు. సుప్రభాతం నాటికను 2వేల ప్రదర్శనలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించాలనే లక్ష్యంతో ఇప్పటికి 1227 ప్రదర్శనలు చేసినట్లు రచయిత కృష్ణమోహన్ విలేకరులకు తెలిపారు. జర్నలిస్టుల కాలనీ, క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలోనూ ఈ ప్రదర్శనలు చేసినట్లు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ



తిరుమల విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జేఈఈ అడ్వాన్స్-2024 పరీక్షల్లో భీమవరం తిరుమల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు కనబర్చారని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు చెప్పారు. భీమవరంలో ఆదివారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఐఐటీ మద్రాస్ ప్రకటించిన ర్యాంకుల్లో కె.అనురూప్‌రెడ్డి ఆల్ ఇండియా 62వ ర్యాంకు సాధించాడన్నారు. వివిధ కేటగిరీల్లో వి.రామ్ చరణ్‌వర్మ 193వ ర్యాంకు, డి.సాయి సత్య 242, సీహెచ్ శ్రవణ్ శ్రీసత్య 440, బి.సత్య అఖిల్ రాజీవ్ 582, ఎం.ఆదిత్య సాయి నాయుడు 689, ఎస్.దేవి శ్రీనివాస్ 713, టి.కృష్ణ తేజ 803, పి.చక్రి వర్మ 911వ ర్యాంకు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ ఎస్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని పూలపల్లి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సంధ్యా మెరైన్స్ కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. 11 కేవీ ఎస్ చిక్కాల ఫీడర్ విద్యుత్ మరమ్మతులు చేపట్టారు. వీటి నిమిత్తం సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా భగ్గేశ్వరం ఇండస్ట్రియల్ ఏరియా, రంగరాజు రైస్‌మిల్లు ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హిందూ ధర్మ పరిరక్షణ సమితి వార్షికోత్సవం



నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారిణులు

పెనుగొండ: సిద్ధాంతంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ప్రథమ వార్షికోత్సవం ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉత్సవాలు నిర్వహించారు. హిందూ ధర్మాన్ని పాటిస్తూ ఆరోగ్య కుటుంబ, నైతిక విలువలు పెంపొందించేలా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఏడాది కాలంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజాదరణ పొందుతోంది. హిందూ ధర్మంలో భాగంగా ప్రతి పౌర్ణమికి గోదావరికి హారతి ఇస్తూ, నగర సంకీర్తన చేస్తూ ఆకట్టుకుంటున్నారు. హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా పలు కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, ముఖ్య ప్రవచన కర్తలతో ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. సమితి ఏర్పడి ఏడాది కాలం పూర్తవడంతో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. రవీంద్ర భారతిలో నంది అవార్డు పురస్కారం పొందిన నాట్య మయూరి కోమలి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకొంది. మహిళలకు పసుపు, కుంకుమ, పండ్లు, రవికలు పంపిణీ చేశారు. కార్యక్రమలో సమితి అధ్యక్షుడు యక్కల త్రిమూర్తులు, జయవరపు నానాజీ, చోడవరపు శ్రీను, కీళ్ల భద్రయ్య, పొన్నాడ పల్లపరాజు, మానేపల్లి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వీరవాసరంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం దృశ్యం

వీరవాసరం: వీరవాసరం మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. తమ చిన్ననాటి విశేషాలను ఒకరికి ఒకరు పంచుకుని ఆనంద పరవశులయ్యారు. ఇప్పటి పరిస్థితులను అడిగి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. వలవల జానకిరామ్, ముద్రగడ శ్రీనివాస్, మల్లుల జైకృష్ణ, పంతం రాము, యేలూరి భానుకుమారి, నిమ్మల దుర్గ, శనివారపు ప్రసాదు ఆధ్వర్యంలో స్కూల్ స్వీపర్ మద్దాల రామకృష్ణను సత్కరించి ఐదువేల రూపాయలు నగదును అందజేశారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పోడూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డి.సుహాసిని ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆమె పిలుపునిచ్చారు.

ఉమామూలేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

వీరవాసరం: రాయకుదురులో వేంచేసి ఉన్న శ్రీ ఉమామూలేశ్వర స్వామి వారి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం స్వామివార్లకు లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామివార్లకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచామృత అభిషేకాలను నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు అనంతరం లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

12 నుంచి ఉచిత కుట్టు శిక్షణ

భీమవరం: వసుధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ ఇవ్వనున్నట్లు కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. పట్టణంలోని శ్రీరాంపురంలోని గాంధీ కస్తూరిబా భవనం, మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఈ శిక్షణ ఇస్తామన్నారు. కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, శారీస్ పెయింటింగ్‌లో నైపుణ్యాలు నేర్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు 86397 30222, 99894 92785 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.